స్థానిక పశు సంపదతో సుస్థిర పాడి పరిశ్రమ

శ్రీ మణి కొట్టెక్కడ్ కేరళ రాష్ట్రంలోని పాలక్కడ్ జిల్లాలోని కొట్టెక్కడ్ గ్రామానికి చెందిన అధునాతన భావాలున్న పాడి రైతు. ఈయన చాలా కాలం సంకర జాతి పశువులతో పాడి పరిశ్రమ నిర్వహించేవారు. ఆ విధంగా 2012 వరకు సాగిపోయింది. పెరుగుతున్న నిర్వహణ ఖర్చులు, ముఖ్యంగా పశువులకు అవసరమైన మేతను సమకూర్చడం చాలా భారంగా మారింది. ఆ పరిస్థితి కారణంగా తన పాల ఉత్పత్తి పద్ధతిని మార్చుకోవాలని అనుకున్నాడు. దిగుబడి తక్కువగా ఉన్నప్పటికీ, స్థానికంగా లభించే పశువులకు అవసరమైన మేతను సమకూర్చడం తక్కువ ఖర్చుతోనే సాధ్యం కావడం ఆయనకు ఈ ఆలోచన రావడానికి కారణమైంది. అంతేకాక, స్థానిక పశు జాతుల నుంచి వచ్చే పాలకు స్థానికంగా మంచి గిరాకీ ఉండడం తో స్థానిక పశువుల పెంపకాన్ని ఆయన చేపట్టారు.

తనకంటే అనుభవం ఎక్కువ ఉన్న రైతులను సంప్రదించి నప్పుడు ఉంబ్లచెరి పశువుల (బాక్సు 1 చూడవచ్చు.) ప్రయోజనాలను గురించి మణికి సరైన అవగాహన ఏర్పడింది. 2012లో ఈ జాతికి చెందిన రెండు పశువులను ఆయన కొనుగోలు చేశారు. ఇప్పుడు వాటి సంఖ్య 16కు చేరింది. ఇన్‌పుట్‌లు తక్కువ అవసరమయ్యే సేంద్రీయ సేద్యాన్ని కూడా ఆయన ప్రారంభించారు. ఆ రకం గా తన పోషణలోని పశువులకు మేలైన మేత అందించగలిగాడు. ఈ మొత్తం ప్రక్రియను ఆయన ప్రయోగాత్మకంగానే చేపట్టారు.

తనకు ఉన్న కొద్ది పొలంలో మణి విశిష్టమైన లక్షణాలున్న వరి వంగడాలతో (జావరా, శ్రేయస్ వంటివి) సాగు చేస్తూంటారు. వీటి నుంచి వచ్చే వరి గడ్డి ఆయన పెంచుతున్న పశువులకు తగినంత మేతగా ఉపయోగపడుతుంది. తన పొలంలో పశువులు గడ్డి మేయడానికి అనుమతిస్తుంటాడు. ఈ రకంగా బయటి నుంచి పశువులకు అవసరమైన మేతను కొనవలసిన భారం తగ్గింది. అందువల్ల పాడి ఉత్పత్తులకు అయ్యే ఖర్చు చాలా తగ్గిపోయింది. కృత్రిమ పద్ధతుల్లో పశు సంతతిని పెంచేందుకు ఆయన ఇష్టపడలేదు. అందువల్ల ఆయన తన మందలో రెండు ఆంబోతులను కూడా చేర్చుకున్నాడు. ఇవి ఉంబ్లచెరి జాతి ఆంబోతుకు, కేరళలోని స్థానిక ఆవు జాతి వేచూర్ ఆవుల నుంచి పుట్టినవే కావడం విశేషం.

ఈ జాతి పశువుల నుంచి వచ్చే పాల దిగుబడి కేవలం రోజుకు 3 లీటర్ల మాత్రమే. అయినప్పటికీ, ఒక్కో లీటర్ పాల నుంచి రూ.100 ఆదాయం లభిస్తున్నది. ఈ పాలను ఎక్కువగా పట్టణ ప్రాంత వినియోగదారులే ఎక్కువగా ఉపయోగిస్తారు. ఆయనే స్వయంగా పాలను తీసుకెళ్లి వినియోగదారులకు సరఫరా



స్వయంగా తాను తయారుచేసిన పంచగవ్య చూపిస్తున్న మణి కొట్టెక్కడ

చేస్తారు. ఈ రకంగా మధ్యలో ఇబ్బంది కలిగించే దళారుల ప్రభావాన్ని ఆయన తప్పించారు. పాలతో పాటు ఇతర పాల ఉత్పత్తులు నెయ్యి, పెరుగు, వెన్న వంటి వాటిని కూడా స్థానిక వినియోగదారులకు మాత్రమే కాకుండా అక్కడి హోటళ్లకు కూడా అందజేస్తుంటారు. ఇందుకోసం ఆయన అవసరమైన సాధనసామగ్రితో ఒక పాడి ఉత్పత్తుల యూనిట్‌నే ఏర్పాటు చేసుకున్నారు.

వినూత్న ఆలోచనలతో ఎప్పటికప్పుడు కొత్త పద్ధతులను ఆచరణలోకి తీసుకువస్తున్నాడు మణి. ఆయన ఆలోచనలోంచి ఆవు పేడ, మూత్రం వంటి పశు వ్యర్థాలతో పంచగవ్య (క్రిమిసంహారకం), స్నానం సబ్బు, పండ్ల పొడి, (ఈ రెండింటి తయారీలోనూ ఆవు పేడను ఉపయోగిస్తాడు), అరక్ (ఆవు మూత్రం ఆధారంగా ఆయుర్వేద ఔషధంలో ఉపయోగిస్తారు) తయారు చేయడం ఆయన ప్రారంభించారు. ఈ ఉత్పత్తులను అన్నింటినీ కూడా ఆయన ప్రత్యేకంగా కర్మ బ్రాండ్ పేరుతో విక్రయిస్తున్నారు. అంతేకాకుండా అవసరమైన రైతులకు ఎండబెట్టి పొడరుగా మార్చిన ఆవు పేడను కూడా సరఫరా చేస్తాడు. (కిలోకి రూ.40లు చొప్పున) పెరడులోనూ, ఇంటి ఆవరణలోనూ మొక్కలు పెంచే గృహవినియోగదారులు కూడా ఈయన దగ్గర నుంచి వీటిని కొనుగోలు చేస్తూంటారు. ఈ రకమైన పాడి ఉత్పత్తుల ద్వారా ఆయనకు నెలకు రూ.35,000 ఆదాయం లభిస్తున్నది.

బాక్సు 1
ఉంబ్లచెరి జాతి పశువుల ప్రత్యేకతలు

తమిళనాడుకు చెందినవి ఈ జాతి పశువులు, స్థానికంగా వీటిని జాతి మదు, మొత్తయ్ మదు, తండావూరు దక్షిణ ప్రాంత మదు, తెర్కుతి మదు అని వ్యవహరిస్తారు. కరువు ప్రాంతాల్లో కూడా నిలదొక్కుకోగలిగిన శక్తి సామర్థ్యాలు వీటి ప్రత్యేకత. ఒక పాలుచేపు కాలంలో సగటున 494 కిలోల పాలను, పాలలో ఫాట్ శాతం 4.94, ఎస్ఎన్ఎఫ్ శాతం 8 లభిస్తాయి. సంకర జాతి పశువులతో పోలిస్తే వ్యాధి నిరోధక శక్తి ఎక్కువ. ఈ జాతి పశువుల సంరక్షణ కోసం తమిళనాడులోని మైదాన ప్రాంతాల్లో ఒక రిజిస్టర్డ్ అసోసియేషన్ కృషి చేస్తోంది. ఈ సంస్థ ఈ జాతి పశువులను పెంచే రైతులకు కూడా చేయూత ఇస్తుంది.

అనుకోకుండా అన్ని ఉత్తమ ప్రమాణాలతో ఈ రైతు సేంద్రీయ పాడి పరిశ్రమను చేపట్టారు. నిజానికి ఆయనకు సేంద్రీయ పాడి పెంపకం ప్రాధాన్యత కూడా సరిగా తెలియదు. అందుకే ఆయన తన పాడి పరిశ్రమకు సర్టిఫికేషన్ అవసరం ఉందని గుర్తించలేకపోయారు. సేంద్రీయ ఉత్పత్తులు లేబుల్‌తో ఆయన తన ఉత్పత్తులను మార్కెట్‌లోకి తీసుకువెళ్లినట్లయితే ఆయన ఆదాయం మరింత పెరుగుతుంది. ఏదిఏమైనా ఇవాళ్టి రోజున సేంద్రీయ పాడి పరిశ్రమ రంగంలో ఆయన తనకంటూ ఒక ప్రత్యేక స్థానం సంపాదించుకున్నాడు. ◆

సమాచార సేకరణ

Sreeram V, Archana Bhatt and Smitha S,
Ph.D.scholars, Division of Dairy Extension,
ICAR-NDRI, Karnal, Haryana.
Email: srieeram@gmail.com

ఆంగ్లమూలం :
లీసా ఇండియా, సంపుటి 19, సంచిక 2, జూన్ 2017

LEISA INDIA Language Editions



Kannada, Telugu, Tamil, Oriya, Hindi, Marathi and Punjabi